సాక్షి తిరుపతి

బుధవారం । 3 । జనవరి । 2024



విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

విద్యుత్ షాక్‌తో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతిచెందిన ఘటన చిల్లకూరు మండలం, చింతవరం సమీపంలో చోటు చేసుకుంది. - 8లో



శివయ్య ప్రతిష్ట దిగజార్చొద్దు

రాజకీయాల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రతిష్ట దిగజార్చొద్దని ఆలయ పాలక మండలి చైర్మన్ సూచించారు. - 8లో



ప్రమాదాల్లో నలుగురి మృతి

తిరుపతి జిల్లాలో మంగళవారం వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడగా, ముగ్గురు గాయాలపాలయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

చిన్నగొట్టిగల్లులో నేడు పింఛన్ల పంపిణీ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు వేదికగా బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ దేవేంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెంచిన ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు చిన్నగొట్టిగల్లు వేదికగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకట్రమణారెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు.

ఈ క్రాప్ తప్పనిసరి

తిరుపతి అర్బన్: రైతులు పంట ఈ క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 1.24లక్షల ఎకరాల్లో వరి సాగుచేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 32 వేల ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తిచేశామని, మరో రెండు నెలల్లో 100 శాతం పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. రైతులు సమీపంలోని ఏవో లేదా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే పంటకు ఈ క్రాప్ పూర్తి చేస్తారని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,358 మంది స్వామివారిని దర్శించుకోగా 19,534 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

5న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 120 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందులో మూగ అభ్యర్థులు సైతం పాల్గొనవచ్చునని తెలిపారు.

ఆగని ఏనుగుల దాడులు



ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న మామిడి తోట

పాకాల: పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. సోమవారం రాత్రి రమణయ్యగారిపల్లి, రమణయ్యగారిపల్లి ఎస్టీ కాలనీ, చంద్రగిరివారిపల్లి, వల్లివేడు, వరదప్పనాయుడుపేట గ్రామాల్లో ఏనుగులు పంట పొలాలపై దాడులకు తెగబడ్డాయి. ఈ దాడుల్లో అరటి, మామిడి, చెరుకు తోటలను సర్వనాశనం చేశాయి. అలాగే తోటల్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు, పొలం చుట్టూ వేసిన కంచెలను ధ్వంసం చేశాయి. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుతం



జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న జేసీ, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అద్భుతమని జేసీ శుభంభన్సల్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పనపాకం పంచాయతీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డిహర్షిత్‌రెడ్డి సైతం ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ పథకం, జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో అవగాహన కల్పించేలా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



రేణిగుంట మండలం, వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో సమావేశమైన స్వయం సహాయక సంఘాల మహిళలు

ఆసరా..ఢోకా లేదురా!

మహిళలకు చేయూతనందిస్తున్న ప్రభుత్వ పథకాలు

- ఆసరా, చేయూతతో మారుతున్న అక్కచెల్లెమ్మల బతుకులు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న డ్వాక్రా సంఘాలు
- రుణమాఫీ పేరుతో గత ప్రభుత్వంలో దగాపడ్డ నారీమణులు
- జగనన్న ప్రభుత్వంలోనే అన్నీ పథకాలు అందుతున్నాయని కితాబు

రేణిగుంట : 'మహిళలు ఆర్థికంగా ఎదగాలి. తమకాళ్లపై తాము నిలబడాలి. తమ కుటుంబంతోపాటు సమాజానికి సేవ చేసే స్థాయికి చేరాలి' అన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలలో అగ్రభాగం అతివలకే కేటాయిస్తున్నారు. ఎన్నికల హామీలను తూచాతప్పకుండా పాటిస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారు.

గతంలో నమ్మించి..వంచించి

'డ్వాక్రా సంఘాలు సృష్టించింది నేనే. వచ్చే ఎన్నికల్లో మాకే ఓట్లు వేయాలి. మీరెవ్వరూ లోన్లు కట్టొద్దు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తా. మహిళలకు అండగా నిలుస్తా..' నంటూ టీడీపీ అధినేత 2014లో ఇచ్చిన హామీలు గాలికొదిలేశారు. అధికారం చేపట్టాక డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసేదిశగా అడుగులు వేశారు. ఫలితంగా చాలా సంఘాలు డీఫాల్టర్‌గా మారాయి. ఆర్థిక ఇబ్బందులు, రుణాలు, వడ్డీలు కట్టలేక మహిళలు అల్లాడాల్సి వచ్చింది.

జగనన్న మాట..ఆర్థిక బాట

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా ఆర్థిక స్వావలంభన దిశగా అడుగులు వేశారు. ఆసరా, చేయూత లాంటి వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు. డ్వాక్రా రుణాల మాఫీ, సున్నావడ్డీని తూచాతప్పక అమలు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పించారు. బ్యాంకర్లు ఇచ్చే రుణాలకు వడ్డీ మాఫీ చేస్తూ అండగా నిలిచారు.

సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల కష్టాలు దగ్గర నుంచి చూశారు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్నారు. గత పాలకుల తీరుతో బక్కచిక్కిన డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అతివలకు అండగా నిలవాలని నిశ్చయించారు. అధికారం చేపట్టిన వెంటనే వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు. డ్వాక్రా రుణాల మాఫీతోపాటు సున్నావడ్డీని క్రమంతప్పకుండా మంజూరు చేస్తూ మహిళల ఆర్థిక స్వావలంభనకు బాటలు వేశారు. ఫలితంగా నేడు మహిళలు మహరాణులుగా రాణిస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సీఎం జగనన్న దయవల్లే తాము ఆర్థికంగా నిలదొక్కుకున్నామని నారీమణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆసరా వివరాలు

మండలం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
రేణిగుంట	4,074	రూ.20,60,25,000
శ్రీకాళహస్తి	6,658	రూ.33,48,50,000
తొట్టంబేడు	2,855	రూ. 17,05,18,750
ఏర్పేడు	3,529	రూ.18,16,31,250
మొత్తం	17,116	రూ. 89,30,52,000

సొంతంగా 15 మేకలు కొన్నాం



గతంలో బ్యాంకు రుణాలు కట్టలేక డీఫాల్టర్ గ్రూపులుగా మారి దోషులుగా నిలబడ్డాం. జగనన్న అధికారంలోకి వచ్చాక మాకు ఇప్పటికే నాలుగు విడతలుగా ఆసరా సొమ్ము అందింది. చేయూత కింద రూ.18,750 చొప్పున నాలుగు విడతలు అందించారు. సున్నా వడ్డీ డబ్బులు ఇచ్చారు. మా సంఘం 'దీపిక సంఘం' తరఫున గ్రూపుకి కొత్తగా రూ.10 లక్షలు లోను ఇచ్చారు. ఆ డబ్బుతో మేము సొంతంగా 15 మేకలు కొన్నాం. మా ఆయన మునిరాజ మేకలు మేపుతున్నాడు. నా కూతురు మునిలక్ష్మి గుత్తివారిపల్లి హైస్కూల్‌లో చదువుతోంది. ఆమెకు ఇప్పటికే మూడు కంతుల్లో రూ.15వేల చొప్పున అమ్మఒడి డబ్బులు వేశారు. జగనన్నే మా ఊరికొచ్చి ఇంటిపట్టా ఇచ్చారు.

– పాముల మంజుల, వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ, రేణిగుంట మండలం

టైలరింగే జీవనాధారం



నేను దుర్గ ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిని. ఆసరా ద్వారా నాలుగు విడతల మొత్తం జమఅయ్యింది. రుణం తీసుకుని మాకున్న టైలరింగ్ షాపును మరికొంత అభివృద్ధి చేసుకున్నాం. రెండు ఆవులు పట్టుకుని మా అత్త మేపుతోంది. నా భర్త వెంకట్రామయ్య దివ్యాంగుడు. ఆయనకు రూ.3 పింఛను ఇస్తున్నారు. మా అత్త మునిలక్ష్మికి వృద్ధాప్య పింఛను ఇస్తున్నారు. నా పెద్ద కుమారుడు లీలాధర్ బీటెక్ చదువుతున్నాడు. అతనికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇప్పటి వరకు రూ.60వేలు, మా చిన్నబ్బాయి తేజ బీబీఏ చదువుతుండగా అతనికి ఇంటర్ వరకు మూడేళ్లు అమ్మఒడి పడింది. నాకు ఇంటిస్థలం ఇచ్చి పక్కా ఇల్లు మంజూరు చేశారు. నాకు రెండు సార్లు కిడ్నీ ఆపరేషన్లు చేశారు.

– జీ.ప్రవీణ, గాజులమండ్యం, రేణిగుంట మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది పేద కుటుంబం. కూలి పనులకు వెళితే గానీ కుటుంబం గడవదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక వలంటీర్ ఇంటికొచ్చి వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా ఒక్కో విడతకి రూ.18,750 వంతున రూ.75 వేలు బ్యాంకు ఖాతాలో జమచేసింది. ఈ నగదుతో ఓ పాడి ఆవు కొనుగోలు చేశా. తద్వారా కుటుంబ పోషణ కొనసాగుతోంది. సీఎం జగనన్నకు మా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుంది.

– ద్రాక్షాయణి, గుడిమల్లం, ఏర్పేడు మండలం

మహిళా పక్షపాతి జగనన్న



మాది వైఎస్సార్ క్రాంతి పథంలో పూజిత పొదుపు సంఘం. మా గ్రూపులో 13 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో ఒక్కొక్క విడతలో రూ.21 వేలు బ్యాంకు ఖాతాలో మొత్తం రూ.84 వేలు ప్రభుత్వం జమచేసింది. ఈ నగదుతో ఇంటి వద్ద చిల్లర దుకాణం పెట్టుకున్నా. సీఎం జగనన్న వైఎస్సార్ ఆసరాను ప్రవేశ పెట్టి మహిళా పక్షపాతిగా నిలిచారు.

– మాధవి, వికృతమాల, ఏర్పేడు మండలం

ఆర్థిక పురోభివృద్ధి



స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ రుణాలను వినియోగించుకుని, ఆ నగదుతో చిన్నపాటి షాపులు, కుటీర పరిశ్రమలు, పశుపోషణ వృత్తులలో స్థిరపడుతున్నారు. కుటుంబ పోషణలోనూ ప్రధాన భూమిక పోషిస్తున్నారు. పొదుపు అలవాట్లు పెరిగి, రుణాలు సక్రమంగా తిరిగి చెల్లిస్తూ బ్యాంకర్ల పరపతిని చూరగొంటున్నారు.

– రెంగంటి నరసింహులు, ఐకేపీ ఏపీఎం, రేణిగుంట



తిరుచానూరులో పింఛను అందుకున్న లబ్ధిదారులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

మురిపెంచన్

- పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ
- పాల్గొన్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- అవ్వాతాతల కళ్లల్లో వెల్లివిరిసిన ఆనందం
- కొత్త లబ్ధిదారులకు పెన్షన్ పత్రాల అందజేత

చంద్రగిరి(తిరుచానూరు): అభాగ్యుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. అవ్వాతాతల మోములో సంతోషం విరబూసింది. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని పెంచడంతో సర్వత్రా హర్షం వ్యక్తమతోంది. ఆనందం మూడింతలయ్యిందని లబ్ధిదారులు సంబరపడుతున్నారు. కొత్త సంవత్సరంలో పెరిగిన రూ.3 వేల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చంద్రగిరి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో ప్రారంభించారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని తిరుచానూరు, రామచంద్రాపురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం, చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారులతో మమేకమయ్యారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.

అర్హతే ప్రామాణికం

ఎన్నికల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయలేదని.. 2019 నుంచే సంక్షేమ పథకాలు, పింఛన్ అమలు వర్తింపజేశారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈనెల 1వ తేదీ నుంచి రూ.3 వేలకు పెంచినట్టు తెలిపారు. సీఎం జగనన్న స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని విన్నవించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఎంపీపీలు, ఆయా మండలాల పరిధిలోని పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పింఛను వివరాలు ఇలా..

- తిరుపతి రూరల్ మండలంలోని 37 గ్రామ సచివాలయాల పరిధిలో 15,924 మంది లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ రూ.3 వేలతో మొత్తం రూ.4 కోట్ల 72 లక్షల 26 వేలు పంపిణీ చేశారు. కొత్తగా 658 పింఛన్‌లు మంజూరయ్యాయి.
- ఆర్సీపురం మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 5,702 మంది లబ్ధిదారులకు రూ.కోటి 67 లక్షల 88 వేలు పంపిణీ చేశారు. 90 మందికి కొత్తగా పింఛన్‌లు మంజూరు చేశారు.
- చంద్రగిరి మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 8,499 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 44 లక్షల 67 వేలు పంపిణీ చేశారు. కొత్తగా 102 మందికి పింఛన్‌లు మంజూరు చేశారు.

ఈ మాదిరిగా ఎప్పుడూ చూడలేదు



గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఎంతో తేడా ఉంది. నేను నెలన్నర ముందు వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడు ఏకంగా రూ.3వేల పింఛను మంజూరయ్యింది. దీంతో పాటు రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, నా భార్యకు వైఎస్సార్ ఆసరా పథకాలు వస్తున్నాయి. ఇది చాలదా పేద వాడు సంతోషంగా ఉండేందుకు. సీఎం జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు.

– చెంచయ్యనాయుడు, నారావారిపల్లి, చంద్రగిరి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాను



నా బిడ్డ పుట్టుకతోనే విభిన్న ప్రతిభావంతుడు. నా భర్త ఓ ప్రైవేటు కంపెనీలో ఎలక్ట్రీషియన్. మేము అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. నా బిడ్డ బేసీశ్వర్‌కు పింఛను కోసం నెల ముందు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. వెంటనే పింఛను మంజూరైనట్లు అధికారులు తెలిపారు. నేడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా పింఛను పత్రాన్ని అందజేశారు.

– లావణ్య, అవిలాల, తిరుపతి రూరల్ మండలం

యువ సైన్యం

- వైఎస్సార్‌సీపీ తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం
- భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్లు ఖరారు
- పార్టీ శ్రేణుల సంబరాలు.. అభినందనల వెల్లువ



భూమన అభినయ్‌రెడ్డి



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

సాక్షి, తిరుపతి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్తల రెండో జాబితాలో భాగంగా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గ సారథులను నియమించారు. కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసిన అసెంబ్లీ సమన్వయకర్తల జాబితాలో యువకులైన ప్రస్తుత తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి (చంద్రగిరి), తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి (తిరుపతి)కి చోటు కల్పించారు. వీరి నియామకంతో తిరుపతి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వీరిద్దరూ ఇప్పటికే నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. తండ్రికి తగ్గ తనయులుగా శభాష్ అనిపించుకుంటున్నారు. తమ నియోజకవర్గాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరి నియామకంతో ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి.

అభినయ్‌రెడ్డి ప్రొఫైల్

పేరు: భూమన అభినయ్‌రెడ్డి వయస్సు: 36
విద్యార్హత: ఎంఎస్(లండన్), బీటెక్(హైదరాబాద్)
తండ్రి: భూమన కరుణాకరరెడ్డి (తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్)
తల్లి: రేవతి
భార్య: మోనీషా
పిల్లలు: ఇద్దరు (ఒక అబ్బాయి, ఒక అమ్మాయి)
పదవులు: తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్

మరింత అందంగా తిరుపతి

తిరుపతి అభివృద్ధికి సీఎం జగనన్న అందించిన సహాయ సహకారాలు మరువలేనివి. నాపై నమ్మకం ఉంచి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్తగా నన్ను ఖరారు చేసిన జగనన్నకు కృతజ్ఞతలు. మా తండ్రి భూమన కరుణాకరరెడ్డి ఆశీస్సులతో తిరుపతి నగరాన్ని భవిష్యత్‌లో మరింత సుందరంగా తీర్చిదిద్దుతా.

– భూమన అభినయ్‌రెడ్డి

మాస్టర్ ప్లాన్ రోడ్ల రూపకర్త అభినయ్

- తిరుపతి నగర విస్తరణ, నగరానికి అనుసంధానం రోడ్ల నిర్మాణంలో భూమన అభినయ్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు.
- నగరాన్ని ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి తప్పించడమే అజెండాగా మరో 45ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 18 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు.
- ఇందులో ఇప్పటికే 14 మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి చేశారు.
- ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా రాకపోకలు సాగించేందుకు తొమ్మిది ఇంటర్నల్ రోడ్లను అభివృద్ధి చేశారు.
- ఆరు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ రోడ్లు, నాలుగు ప్రధాన కూడళ్ల విస్తరణకు తీసుకున్న చర్యలపై నగర ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- నగర ప్రజల ఆధునిక సౌకర్యాలకు రూ.80 కోట్లతో సీసీ రోడ్లు, తారు రోడ్లు, మురుగు కాలవలు, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.
- భవిష్యత్తులో మరో 12 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశారు.
- నగర భవిష్యత్తు, అభివృద్ధి, ప్రజల సౌకర్యాల కల్పన ఆలోచనలన్నీ భూమన మదిలో నుంచి పురుడుపోసుకున్నవే.

మోహిత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం

- తండ్రి నుంచి వచ్చిన నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకుని.. చిన్ననాటి నుంచే ప్రత్యక్ష ఎన్నికల్లో ఓటమి లేని విజయాలతో ముందుకు సాగుతున్నారు.
- సింగపూర్‌లో గ్రాడ్యూయేషన్ పూర్తిచేసి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లండన్‌లోని వార్విక్ యూనివర్సిటీ నుంచి డిస్టింక్షన్‌లో మాస్టర్స్ డిగ్రీ పట్టాను పొంది ఉన్నత విద్యనభ్యసించారు.
- 14 ఏట స్కూల్ ఎస్పీఎల్‌గా మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.
- 16వ ఏట జూనియర్ కాలేజీ విద్యార్థి విభాగం చైర్మన్‌గా పోటీచేసి గెలుపొందారు.
- 18 ఏళ్లకే ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులై ఆరు సంవత్సరాలు బాధ్యతలు నెరవేర్చారు.
- 22 ఏళ్లకు తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.
- 1లక్ష 33 వేల ఓటర్లు కలిగి, 39 మంది ఎంపీటీసీ సభ్యులు, 40 మంది సర్పంచ్‌లు ఉన్న రాష్ట్రంలోనే అతిపెద్ద మండలమైన తిరుపతి రూరల్ మండల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ వర్క్స్ కమిటీ స్థాయి సంఘ సభ్యుడిగా పనిచేశారు.
- అతి చిన్న వయసులో తుడా చైర్మన్‌గా, టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు.
- వైఎస్సార్‌సీపీలో కీలకమైన యువజన విభాగం రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నియోజకవర్గ జనరల్ ఏజెంట్‌గా పనిచేసి దాదాపు 43 వేల ఓట్ల మెజారిటీ రావడంలో కీలక పాత్ర పోషించారు.
- ఏడు నెలలుగా చంద్రగిరి నియోజకవర్గంలో వందలాది కిలోమీటర్ల గడపగడపకు మహాపాదయాత్ర చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు.

జగనన్న పేరు నిలబెట్టేలా.. నాన్నలా పనిచేస్తా

నాపై నమ్మకంతో నన్ను చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారికి కృతజ్ఞతలు. జగనన్న పేరు నిలబెట్టేలా, భయంతో, బాధ్యతతో నాన్నలా కష్టపడి పనిచేస్తా. నా చంద్రగిరి ప్రజలు శభాష్ అనేలా సంక్షేమం, అభివృద్ధి కోసం సైనికుడిలా సేవలందిస్తా.

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని డిప్యూటీ స్పీకర్ కొల్లు వీరభద్రస్వామి, ఎమ్మెల్యే పేర్న నాని, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు.

ముసుగు దొంగ చేతివాటం

శ్రీరంగరాజపురం : ఓ ముసుగు దొంగ పెట్రోల్ బంకులో అర్ధరాత్రి చోరీకి పాల్పడి నగదు కాజేసిన సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ముసుగుదొంగ ఇండియన్ పెట్రోల్ బంక్‌లో చోరీకి పాల్పడ్డాయి. బంకులోని కౌంటర్లో ఉన్న రూ.2.4 లక్షల నగదును దొంగలించాడు. దొంగ చోరీ చేస్తున్న విషయం సీసీ కెమెరాలో రికార్డు అయింది. అనంతరం లక్ష్మీపురం గ్రామం వద్ద ఉన్న నయారా పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి చోరీ చేసే క్రమంలో తలుపును పగుల గొట్టడానికి విశ్వప్రయత్నం చేశాడు. అయితే ఎంతోసేపటికీ తలుపు రాకపోవడంతో వెనుదిరిగాడు.

శివయ్య ప్రతిష్ట దిగజార్చొద్దు

- శ్రీకాళహస్తీశ్వరాలయంపై టీడీపీ అసత్య ప్రచారం
- ఆగమశాస్త్ర నిబంధనల మేరకే అభివృద్ధి పనులు
- పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వెల్లడి


మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

సాక్షి, తిరుపతి: రాజకీయాల కోసం శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానాన్ని వేదికగా చేసుకుని టీడీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో పురాతన రాతి మండపాలు ఏవీ తొలగించలేదన్నారు. 1956లో పోటుకు అనుబంధంగా ఏర్పాటు చేసిన స్టోర్ రూమ్ సిమెంట్ కట్టడం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి అక్కడ ఆశీర్వాద మండపంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి వాస్తవాలకు విరుద్ధంగా పురాతన కట్టడాలు కూల్చివేసినట్టు మాట్లాడడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయం లోపలికి ఫోన్లు తీసుకెళ్లి సెల్ఫీలు తీయడం దుర్మార్గమన్నారు. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెండేళ్ల క్రితమే పోటు వద్ద ఉన్న స్టోర్ రూమ్ స్థానంలో ఆశీర్వాద మండపం చేయాలని ధర్మకర్తల మండలి తీర్మానించిందన్నారు. తమ ధర్మకర్తల మండలి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి క్షేత్ర ప్రతిష్ట పెంచే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. స్టోర్ రూమ్ సిమెంట్ కట్టడం తొలగింపులో విగ్రహాలు ఏమీ లేవన్నారు. దీనిపై ప్రమాణం చేయడానికి బొజ్జల సుధీర్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు. బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి మహా కుంభాభిషేకం తమ హయాంలోనే చేస్తున్నామని గుర్తుచేశారు. స్వామి వారి డిపాజిట్లు రూ.236 కోట్లు ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు అత్యంత ఆవశ్యమని, దీనిపై మరో వారం రోజుల్లో ఉన్నత స్థాయి సమావేశం ఎమ్మెల్యే నిర్వహించనున్నట్లు తెలిపారు. శివయ్య గోపురం వద్ద రూ.45 లక్షలతో వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

విరుద్ధంగా ఎలాంటి పనులు చేపట్టలేదు

ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, వేద పండితులు అర్ధగిరి మాట్లాడుతూ ఆలయం లోపల ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. రాజకీయాలకతీతంగా ఆలయ ప్రతిష్ట పెంచే విధంగా వ్యవహరించాలని, మన ఆలయం మన క్షేత్రం ప్రతిష్ట కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హితవు పలికారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 116 శ్రీరామ మందిరాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో ధర్మకర్త మండలి సభ్యురాలు సుమతి, ఆలయ అధికారులు అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూకరత్నం, డిప్యూటీ ఈఓ వెంకటసుబ్బయ్య, ధనపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వేద పండితుల అర్ధగిరి, మారుతి శర్మ, ప్రభాకర్ శర్మ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఏఈ శివ కిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, మీడియా పార్టీ ఇన్‌చార్జ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.5 కోట్ల భూమి హాంఫట్


ఆమందూరు బీసీ కాలనీలో చదును చేసిన డీకేటీ భూమి

- యథేచ్ఛగా టీడీపీ నాయకుడి ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ఏర్పేడు: ఓ టీడీపీ నాయకుడు బరితెగించాడు. ప్రభుత్వ డీకేటీ భూమినే ఆక్రమించుకుని ప్లాట్లు వేశాడు. ఆపై దర్జాగా విక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్నాడు. ఇదెక్కడో కాదండోయ్.. ఏర్పేడు మండలం, ఆమందూరు బీసీ కాలనీలో.. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అసలు విషయం ఏంటంటే?

మండలంలోని ఆమందూరు పంచాయతీ, ఆమందూరు బీసీ కాలనీకి సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు, ఐఐటీ తిరుపతి, అండర్ బ్రిడ్జి ఉండడంతో భూముల ధరకు రెక్కలొచ్చాయి. అలాగే ఇళ్ల స్థలాలకు మరింత డిమాండ్ పెరిగింది. ఆమందూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నం.96-3లో 1.38 ఎకరాల డీకేటీ భూములు కంచి అంజమ్మ పేరుతో ఉన్నాయి. ఈ భూములు ఆమందూరు బీసీ కాలనీ ఆనుకుని ఉండడంతో వాటిపై స్థానిక టీడీపీ నాయకుడి కన్నుపడింది. భూములకు కొంత సొమ్ము రైతుల వద్ద నుంచి స్టాంపు పేపర్లపై సంతకాలు చేయించుకుని తన పేరున రాయించుకున్నారు. ఆ తర్వాత భూములను జేసీబీతో చదును చేసి వెంచర్ వేసి ప్లాట్లుగా చేశాడు. ఓ ప్లాట్‌ను రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఎకరా భూమి విలువ సుమారు రూ.5 కోట్లుకు పైబడి ఉంది. ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ భూములను అనుభవించే అవకాశం మాత్రమే ఉంటుంది. క్రయ విక్రయాలు నిషేధం. కానీ సదరు టీడీపీ నాయకుడు ఏకంగా ప్లాట్లు వేసి విక్రయించడం విమర్శలకు తావిస్తోంది.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

డీకేటీ భూముల్లో ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టడం నేరం. అలాంటి వాటిపై విచారణ చేపడతాం. ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు. విచారణలో డీకేటీ భూములుగా తేలితే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

-శివప్రసాద్, తహసీల్దారు, ఏర్పేడు మండలం

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

చిల్లకూరు: లారీ డ్రైవర్లుగా పనిచేసేందుకు వచ్చిన ఇద్దరు యువకులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన చిల్లకూరు మండలం, చింతవరం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చింతవరం గ్రామానికి చెందిన పూడిపర్తి మల్లారెడ్డికి ఉన్న టిప్పర్లలో డ్రైవర్లుగా పనిచేసేందుకు కొంత కాలం క్రితం ఝార్ఖండ్ రాష్ట్రం, హజీరాబాగ్ జిల్లా పడిర్మా గ్రామానికి చెందిన బీరేంద్రకుమార్(21), కోడిరామ్ జిల్లా, గుంబో బారావాడి గ్రామానికి చెందిన మనీష్ చౌదరి (21) వచ్చారు. వీరు ఇతర ప్రాంతాలకు లారీలో లోడ్లు తీసుకుని వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో మల్లారెడ్డికి చెందిన కాటా వద్ద టిప్పర్‌ను నిలుపుకుని సహచర డ్రైవర్ ముఖేష్‌తో కలిసి ఇద్దరూ గ్రీస్ పట్టేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో పైన వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలను గమనించకుండా హైడ్రాలిక్ ఎత్తారు. వెంటనే విద్యుత్ తీగలకు టిప్పర్ బాడీ తగలడంతో గ్రీస్ పెడుతున్న బీరేంద్రకుమార్, అందులోనే ఉన్న మరో డ్రైవర్ ముఖేష్, మనీష్ చౌదరి షాక్‌కు గురయ్యారు. ముఖేష్ టిప్పర్‌లో నుంచి కిందకు దూకివేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. టిప్పర్‌లోనే ఉన్న మనీష్‌చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా, బీరేంద్రకుమార్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతనిని స్థానికులు చింతవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్క డ చికిత్స పొందుతూ బీరేంద్రకుమార్ మృతి చెందా డు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని జార్ఖండ్ రాష్ట్రంకు చెందిన మరికొంత మంది నుంచి వివరాలను సేకరించారు. అనంతరం కాటా యజమాని మల్లారెడ్డి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. గతంలోనూ ఇదే స్థలంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ డ్రైవర్ ఒకరు మృతి చెందినట్లు గుర్తుచేశారు.

సచివాలయంలో చోరీకి యత్నం


పగులగొట్టిన బీరువా

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో సోమవారం రాత్రి చోరీకి యత్నించినట్టు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌హుక్ తెలిపారు. సచివాలయానికి వెనుక వైపు ఉన్న ఇనుప తలుపునకు వేసి ఉన్న తాళాలను పగులకొట్టి కార్యాలయంలోకి ప్రవేశించారన్నారు. ఆతర్వాత బీరువాని పగులగొట్టి రికార్డులు చిందరవందర చేశారని చెప్పారు. మంగళవారం ఉదయం పంచాయతి కార్యదర్శి బీరువా తాళాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి టెన్నిస్ పోటీలు


టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను బుధవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారు మాట్లాడుతూ 35, 45, 55, 65, 70 వయసు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు, 75 పైబడిన వారికి డబుల్స్ మాత్రమే నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రైజ్‌మనీ ఉంటుందని తెలిపారు.

ఆడుదాం.. ఆంధ్రా విజేతల దాతృత్వం

పెద్దపంజాణి: ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన విజేతలు తమకు వచ్చిన నగదు బహుమతిని లివర్ వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తికి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని రాయలపేట, కమ్మపాళ్యం సచివాలయాల పరిధిలో ఇటీవల ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలు జరిగాయి. అందులో గెలుపొందిన విజేతలకు స్థానిక సర్పంచ్ అరుణ, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా సలహాదారు డా.చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ అంజమ్మ, ఎంపీటీసీ సరస్వతి గురునాథ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, రాయలపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రూ.10 వేలు నగదు బహుమతిని ప్రదానం చేశారు. అయితే ఈ నగదును విజేత జట్టులోని సభ్యులు మంగళవారం లివర్ వ్యాధితో బాధపడుతున్న గంకొండ గ్రామానికి చెందిన జి. సురేష్‌కు వైద్య చికిత్సల కోసం అతని సమీప బంధువు భాస్కర్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పీఎస్‌లు గణపతి, జఫ్రుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



మురళీనాయుడు, హరి మృతదేహాలు


కాలువలో పడి మృతి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ నాగరాజు


జగన్నాథ రెడ్డి(ఫైల్)

ఏర్పేడు: జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఏర్పేడు మండలంలోని చింతలపాలెం ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం ఇన్నోవా కారు బీభత్సం సృష్టించింది. డివైడర్‌ను ఢీకొని టీ దుకాణంలోకి దూసుకెళ్లడంతో అక్కడ టీ తాగుతున్న ఇద్దరు మృత్యువాత పడ్డారు. సీఐ శ్రీహరి కథనం.. చింతపాళెం గ్రామానికి చెందిన దామెరమురళీనాయుడు(53), ఎస్సీ కాలనీకి చెందిన కొల్లేటి హరి(50) ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద ఉన్న టీ దుకాణంలో టీ తాగుతుండగా.. అదే సమయంలో వెంకటగిరి నుంచి తిరుపతికి వెళుతున్న ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీకొని టీ దుకాణంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో టీతాగుతున్న మురళీనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడ్డ హరి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఫారెస్ట్ బీట్ అధికారిణి హైమావతితో పాటు కారు డ్రైవర్ సుధాకర్, కారులోని మరో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ సుధాకర్ మద్యం సేవించి కారు నడిపినట్లు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చంద్రగిరి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొని తిరుపతి రూరల్ మండలం, సీ.మల్లవరం దళిత వాడకు చెందిన నాగరాజు(60) మృతి చెందాడు. ఎల్ఐసీ ఏజెంట్‌గా జీవనం సాగిస్తున్న ఆయన సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంలో తొండవాడకు చేరుకుని అక్కడి నుంచి తిరిగి ఇంటికి వెళ్తూ మృత్యువాత పడ్డాడు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్ఐ రవీంద్రనాయక్ తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని..


నడుచుకుని వెళ్తున్న ఓ వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన తొండవాడ సమీపంలోని పంజాబీ దాబా వద్ద చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొత్తశానంబట్లకు చెందిన జగన్నాథ రెడ్డి(56) బోరు మోటార్ల మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పంజాబీ దాబా వద్ద స్నేహితులతో కలిసి భోజనం చేసి తన స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు కాలినడకన సర్వీసు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి తిరుపతి రూరల్ పేరూరుకు చెందిన టిప్పర్ ఢీకొట్టింది. జగన్నాథరెడ్డిపై నుంచి టిప్పర్ దూసుకెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. టిప్పర్ డ్రైవరు, క్లీనర్ అక్కడి నుంచి పారిపోయారు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి, ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నిరసనకు దిగారు. ఎస్ఐ హిమబిందు గ్రామస్తులకు నచ్చజెప్పి పంపించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం, పిట్టలవారి సంధు సమీపంలో స్వర్ణముఖి నది వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. 1వ పట్టణ పోలీసుల కథనం.. పిట్టలవారి సంధు సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(60) మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని వివరాల కోసం ఆరా తీశారు. అయితే ఏవీ లభ్యం కాకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సదరు వృద్ధుడి వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

దుకాణంలో అగ్నిప్రమాదం


తగలబడుతున్న దుకాణం

రాపూరు: పాత బస్టాండ్‌లోని ఫ్యాన్సీ, స్టీల్ సామగ్రి, గిఫ్ట్ ఆర్టికల్ విక్రయించే దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అన్నమయ్య జిల్లా చిట్వేలికి చెందిన వెంకటేశ్వర్లు తమ దుకాణాన్ని సాయంత్రం మూసి వేసి, వెళ్లారు. రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి పొగలు వ్యాపించడంతో పక్క దుకాణ యజమానులు ఆ దుకాణ యజమానికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిందని దుకాణ యజమాని వెంకటేశ్వర్లు తెలిపారు.